క్లుప్తంగా

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పరిగి: ప్రతి ఒక్కరి ఆరోగ్యం వారి చేతుల్లోనే ఉంటుందని మెడికల్ ఆఫీసర్లు నవీన, స్వరూపరెడ్డి తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం పరిగిలో కేజీబీవీ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా నా ఆరోగ్యం నా హక్కు నినాదంతో అవగాహన ర్యాలీని నిర్వహించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు పలు సూచనలు, సలహాలిచ్చారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్న కారు

సోమందేపల్లి: మండలంలోని నల్లగొండ్రాయనపల్లి వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొనడంతో ఐస్ క్రీం విక్రయదారుడు మాబూసాబ్ తీవ్రంగా గాయపడ్డాడు. గోరంట్ల మండలం మల్లాపల్లికు చెందిన మాబూ సాబ్ ఆదివారం ద్విచక్ర వాహనంలో సోమందేపల్లిలో ఐస్‌క్రీమ్ విక్రయించి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. అయితే బెంగళూరు వైపు నుంచి వెళ్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని వెనుక వైపు నుంచి ఢీ కొనడంతో అతని తలకు గాయలయ్యాయి. వెంటనే చికిత్స కోసం హిందూపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పేద ముస్లింలకు దుస్తుల పంపిణీ


దుస్తులు అందజేస్తున్న దృశ్యం

పావగడ: పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక ధనిక ముస్లింలు పేద ముస్లింలకు హిత్రా (దానం) నిర్వహిస్తూ మానవత్వం చాటుకుంటున్నారు. పట్టణంలోని 7వ వార్డుకు చెందిన రైనేజ్ ఎక్స్‌టెన్షన్‌లో ఎంఏఈ అల్తాఫ్ ఆధ్వర్యంలో వందలాది మంది ముస్లిం మహిళలకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

హిందూపురం: ఎన్నికల సమయంలో సరైన నిర్ణయంతో ఓటుహక్కును సద్వినియోగం చేసుకోకపోతే భవిష్యత్తు అంధకారమేనని శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామిజీ అన్నారు. ఆదివారం స్థానిక కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో పవర్ ఆఫ్ ఓటు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ప్రలోభాలకు లోనవకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

దివ్యాంగుల బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దివ్యాంగులు

పావగడ: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్థానిక దివ్యాంగులు పట్టణంలో ఆదివారం పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. బళ్లారి రోడ్డు నుంచి సాగిన బైక్ ర్యాలీ శని మహాత్మ సర్కిల్ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా మానవహారం నిర్వహించారు. స్వీప్ సమితి అధ్యక్షుడు ఈఓ జానకీరాం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

లెక్కా పత్రం లేకుంటే చిక్కులే !

- రూ.50 వేలకు పైగా తరలిస్తే రుజువులు తప్పనిసరి
- లెక్కలకు పత్రాలు లేకుంటే నగదు, సామగ్రి జప్తు
- తనిఖీలను విస్తృతం చేసిన అధికారులు


కొడికొండ చెక్‌పోస్టులో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

హిందూపురం అర్బన్/హిందూపురం టౌన్: ఎన్నికల వేళ అంతరాష్ట్ర తనిఖీ కేంద్రాలతో పాటు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 23 తనిఖీ కేంద్రాల వద్ద పోలీసులు, అధికారులు విస్తృత తనిఖీలు చేస్తున్నారు. ఎక్కడికక్కడ మద్యం, నగదు, వెండి , బంగారు ఆభరణాలు, ఇతర సామగ్రి అక్రమంగా తరలివెళ్లకుండా నిఘా కట్టుదిట్టం చేశారు.

పట్టుబడితే తిప్పలే..

ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే పోలీస్, రెవెన్యూ బృందాలతో పాటు ప్రత్యేక బృందాలు తనిఖీలను ముమ్మరం చేశాయి. నగదు, ఇతర సామగ్రికి సంబంధించి ఏ సమాచారం తెలిసినా రోడ్లపై, లాడ్జిలు, ఇళ్లలో కూడా తనిఖీ చేస్తున్నారు. వీరి తనిఖీల్లో నిత్యం రూ.లక్షల్లో నగదు పట్టుబడుతోంది. ఇప్పటికే రూ.80 లక్షలకు పైగా నగదు పట్టుబడినట్లు తెలిసింది. ఇక ఇతర వస్తువులతో కలిపి రూ.1.50 కోట్లకు చేరింది. పట్టుబడుతున్న నగదును ఆదాయపు పన్ను శాఖకు, ఎలాంటి బిల్లులు లేకుండా తరలిస్తున్న సరకును వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు అప్పగిస్తున్నారు. అక్రమంగా తీసుకెళ్తున్న వాహనాలు, మద్యాన్ని సెబ్ పోలీసులు సీజ్ చేస్తున్నారు.

లెక్క సరిగ్గా ఉన్నా కష్టమే..

పట్టుబడిన నగదు, విలువైన వస్తు సామగ్రి వదిలేయడంపై క్షేత్రస్థాయి అధికారులు నిర్ణయం తీసుకొనేందుకు వీలు లేదు. ఇందుకోసం జిల్లా స్థాయి కమిటీని నియమించారు. క్షేత్రస్థాయి అధికారులు పెద్ద ఎత్తున డబ్బు పట్టుకున్నా వారి వద్ద తగిన ఆధారాలు ఉన్నా దాన్ని వదిలేయకుండా విషయాన్ని తప్పని సరిగా జిల్లా కమిటీ దృష్టికి తీసుకువెళ్లాలి. ఇందుకోసం ప్రామాణిక కార్యాచరణ విభాగం (ఎస్‌ఓపీ) అమలు చేస్తున్నారు. పట్టుబడిన వాటిపై ఈ కమిటీ నిర్ణయం తీసుకొని కలెక్టర్‌కు నివేదిస్తే కలెక్టర్ సంతకం చేస్తారు.

సుమోటోగా విచారణ..

ఎన్నికల నిబంధనల ప్రకారం రూ.50 వేలు కంటే ఎక్కువ మొత్తంలో డబ్బు తరలిస్తూ పట్టుబడితే తనిఖీ బృందం వెంటనే రిటర్నింగ్ అధికారితో పాటు, పోలీస్ అధికారులకు సమాచారం అందిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్నికల విభాగానికి, వారు జిల్లా స్టీరింగ్ కమిటీ దృష్టికి తీసుకెళ్తారు. పత్రాలు సరిగా ఉండి ఎన్నికలకు ఆ నగదు సంబంధం లేదని నిర్ధారించుకున్న తర్వాతనే స్థానిక రిటర్నింగ్ అధికారి సూచనతో వదిలేస్తున్నారు. ఏ మాత్రం అనుమానం వచ్చినా దానిపై జిల్లా స్టీరింగ్ కమిటీ సుమోటోగా విచారణ జరుపుతుంది. ఒక వేళ సొమ్ము జప్తు చేస్తే మాత్రం అప్పీలుకు వెళ్లేందుకు అవకాశం ఇస్తోంది.

రూ.10 లక్షలు దాటితే.

రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకూ తరలించే నగదుకు విధిగా అకౌంటబులిటీ ఉండాలి. రూ.10 లక్షలపైన తరలించే నగదుకు అకౌంట్‌బులిటీ ఉన్నా సీజ్ చేసి ఆదాయపు పన్నుశాఖ అధికారులకు అప్పగిస్తారు. వారు నగదు ఎలా సంపాదించారని, ఆదాయపన్ను చెల్లిస్తున్నారో లేదో అనే వివరాలు సేకరించి, అన్నీ సక్రమంగా ఉంటే బాధితుడికి అప్పగిస్తారు.

- చిలమత్తూరు మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారిపై కొడికొండ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు మార్చి 25న భారీగా బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై విచారించగా మలబార్ గోల్డ్‌కి చెందిన బంగారంగా గుర్తించారు. ఐదు రోజుల పాటు అన్ని శాఖల అధికారులు సమగ్రం విచారణ చేపట్టారు. వాటికి సంబంధించిన పత్రాలు, బిల్లులు అన్ని చూపడంతో సంబంధిత కంపెనీ వారికి అప్పగించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో తిరిగి వారి బంగారాన్ని పొందడానికి నానా తంటాలు పడాల్సి వచ్చింది.
- హిందూపురం పట్టణంలోని మోడల్ కాలనీ, నింకంపల్లికి చెందిన వారు ఈ నెల 3న ఎలాంటి పత్రాలు లేకుండా రూ.7.44 లక్షల నగదు తీసుకెళ్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల తనిఖీల్లో పట్టుబడ్డారు. నగదు స్వాధీనం చేసుకొని వారిపై కేసులు నమోదు చేశారు.
- కర్ణాటక నుంచి ఈ నెల 5న జిల్లాలోనికి పలు మార్గల్లో మద్యం తరలిస్తుంగా సెబ్ ప్రత్యేక బృందం, స్థానిక సెబ్ పోలీసులు తనిఖీ చేయగా కారు, ద్విచక్ర వాహనాల్లో తరలిస్తున్న 2 వేల టెట్రా ప్యాకెట్లు పట్టుకొని కేసు నమోదు చేశారు.
- హిందూపురం పట్టణంలో ఈ నెల 6న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహనాలు తనిఖీలు చేశారు. ఎలాంటి పత్రాలు లేకుండా నగదు తీసుకెళ్తున్న ఇద్దరి నుంచి 3.40 లక్షలు స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు.
- వారం క్రితం తూమకుంట చెక్‌పోస్టులో ఎలాంటి బిల్లులు లేకుండా 600 చీరలు పట్టుబడగా వాటిని అధికారులు స్వాధీనం చేసుకొని వాణిజ్య పన్నుల అధికారులకు అప్పగించారు.

అగళిలో ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

అగళి: మండల కేంద్రంలోని జామియా మసీదు వద్ద ఆదివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పాల్గొన్నారు. ముందుగా ఈరలక్కప్ప ముస్లింతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం ముస్లిం సోదరులకు స్వయంగా ఈరలక్కప్ప, నాయకులు భోజనం వడ్డించారు.

ప్రభుత్వాస్పత్రికి పరుపులు, మంచాల వితరణ


రొద్దం ఆస్పత్రికి అందజేసిన బెడ్లు

రొద్దం: జిల్లాలో పలు ప్రభుత్వాస్పత్రులకు ఎస్ఎల్‌ఏపీ కంపెనీ, సీఎస్ఆర్ ఆధ్వర్యంలో రూ. 65 లక్షల విలువ చేసే మంచాలు, బెడ్లు, బెడ్ షీట్లు, ఇఎన్‌టీ మిషన్ తదితర సామగ్రి అందజేసినట్లు కంపెనీ కార్యదర్శి సురేష్ రెడ్డి వితరణ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి పది మంచాలు, పది బెడ్లు , పది బెడ్‌షీట్లు అందించారు. హిందూపురం ఆస్పత్రికి రూ 30 లక్షల విలువ చేసే ఇఎన్‌టీ మిషన్, 200 బెడ్లు, మంచాలు అందజేశామన్నారు. అదేవిధంగా గోరంట్ల, మడకశిర ఆస్పత్రులకు అందజేశామన్నారు.

ముస్లింలకు మంత్రి ఉషశ్రీచరణ్ ఇఫ్తార్ విందు


ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి ఉషశ్రీచరణ్

రొద్దం: మండల కేంద్రంలోని జామియ మసీదు వద్ద రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరులకు ఆదివారం సాయంత్రం మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముతవల్లీ దువా ప్రార్థనలు చేసి మంత్రిని ఆశీర్వదించారు. ఉపవాసం ఉన్న వారికి ఉషశ్రీచరణ్ స్వయంగా భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని ఫౌజియా మసీదు వద్ద మంత్రి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు చరణ్‌రెడ్డి భోజనాన్ని వడ్డించారు. మసీదులో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు నాగభూషణంరెడ్డి, మైనార్టీ నాయకులు రఫీక్, ఇమామ్‌వలి, అబ్దుల్, బాబు, దావూద్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరు గ్రామంలో మంత్రి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. మంత్రి భర్త చరణ్‌రెడ్డి ముస్లిం మతపెద్దలతో కలసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీరాములు, ముస్లిం మత పెద్దలు రిజ్వాన్, బషీర్, ముస్తఫా, నజీర్, ఇమ్రాన్, అల్లాబకాష్, అజ్మతుల్లా, నాయకులు నారాయణస్వామి, పిట్టా బాబు, కాంట్రాక్టర్ రాము తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

గోరంట్ల: మాజీ మండల ఉపాధ్యక్షుడు, సీనియర్ టీడీపీ నాయకుడు చలమయ్యగారిపల్లి గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డితో పాటు 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఆదివారం మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్, ఎంపీ అభ్యర్థి శాంతమ్మ సమక్షంలో వారు వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. పార్టీలో చేరిన వారిలో నాగరాజు, శ్రీనివాసులు, గంగాధరరెడ్డి, విశ్వనాథరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాజశేఖరరెడ్డి, అంజినప్ప, కిష్టప్ప, రవి, వెంకటేశులు, గోపాల్, నాగమణి, నరసింహప్ప తదితరులు ఉన్నారు. సీఎం జగన్ చేస్తున్న సంక్షేమాభివృద్ధికి ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరామని, పార్టీ గెలుపుకు కృషి చేస్తామని రామచంద్రారెడ్డి అన్నారు. మంత్రి ఉషశ్రీ భర్త చరణ్‌రెడ్డి, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి ఉషశ్రీ పర్యటన

పరిగి: మంత్రి ఉషశ్రీచరణ్ సోమవారం మండలంలో పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి తెలిపారు. మోదా, శ్రీరంగరాజుపల్లిలో మంత్రి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కోనాపురం, మోద గేటు, పుట్టగూర్లపల్లి, చెర్లపల్లి, మోద తదితర గ్రామాల్లో సాయంత్రం 4.30 గంటల నుంచి ప్రచారం చేస్తారన్నారు.


వైఎస్సార్‌సీపీలో చేరుతున్న వారితో మంత్రి ఉషశ్రీచరణ్

ఆదరించండి.. అండగా ఉంటా


మడకశిరలో బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు ప్రసాద్‌రెడ్డి తదితరులు


బైక్ ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

- వైఎస్ జగన్ మళ్లీ సీఎం అయితేనే పేదలకు న్యాయం
- వైఎస్సార్‌సీపీ మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

మడకశిర: నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే తనను గెలిపించి అసెంబ్లీకి పంపితే ప్రజలకు అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప అన్నారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని తెలిపారు. ఆదివారం మడకశిరలో చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో పార్టీ పరిశీలకుడు ప్రసాద్‌రెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి బైక్ ర్యాలీని పచ్చజెండా ఊపి వారు ప్రారంభించారు. దారి మధ్యలో వాల్మీకి, అంబేడ్కర్ విగ్రహాల వద్ద నివాళులర్పించారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి

ఈరలక్కప్ప మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. తనతో పాటు హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి శాంతమ్మకు కూడా మడకశిర నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీ ఇవ్వాలని కోరారు. మరోసారి రాష్ట్రానికి వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయితేనే పేదలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. లేకపోతే పేదలు అన్ని విధాలా నష్టపోతారని చెప్పారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని తెలిపారు.

టీడీపీకి డిపాజిట్లు కూడా దక్కవు

చంద్రబాబు తప్పుడు హామీలతో మళ్లీ ప్రజలను మభ్య పెడుతున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ధ్వజమెత్తారు. ప్రజలు చంద్రబాబు చెప్పే మాయ మాటలను నమ్మి మోసపోవద్దని కోరారు. 2019 ఎన్నికల్లో చంద్రబాబు ఎన్నో హామీలిచ్చారని, అయితే హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ముఖ్యంగా రుణమాఫీ చేస్తానని రైతులు, మహిళలను మోసం చేసిన ఘనుడన్నారు. టీడీపీకి ఈ ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవన్నారు.

రొళ్ల: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం చేపట్టిన భారీ బైక్ ర్యాలీకి స్పందన లభించింది. ఈ సందర్భంగా రొళ్ల బస్టాండ్ ఆవరణలో జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప సమక్షంలో మల్లసముద్రం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్రీరంగప్ప తన అనుచరులతో కలిసి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈరలక్కప్ప పార్టీ కండువాను వేసి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

అగళి: వైఎస్సార్‌సీపీ బైక్ ర్యాలీకి మంచి స్పందన వచ్చింది. ఆదివారం మండల కేంద్రం నుంచి వందలాది మంది మడకశిరకు తరలివెళ్లారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

అమరాపురం: మండలంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు చేపట్టిన బైక్ ర్యాలీ విజయవంతమైంది. ఈ సందర్భంగా జై జగన్, వైఎస్సార్‌సీపీ జిందాబాద్ అంటూ కార్యకర్తలు నినాదాలు చేస్తూ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అన్ని వర్గాల ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గుడిబండ: మండల కేంద్రంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ హామీలన్నీ పక్కాగా అమలు చేయడంతో అభివృద్ధిలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్న వైఎస్ జగన్‌కు అన్ని వర్గాల ప్రజలు మద్దతివ్వాలన్నారు.

బైక్ ర్యాలీకి విశేష స్పందన

మడకశిర: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం నిర్వహించిన బైక్ ర్యాలీకి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వేలాది మంది పార్టీ శ్రేణులు ఈబైక్ ర్యాలీలో పాల్గొన్నారు. బైక్ ర్యాలీని మడకశిరలో పార్టీ అసెంబ్లీ అభ్యర్థి ఈరలక్కప్ప, పార్టీ పరిశీలకుడు ప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఉదయం ప్రారంభమైన బైక్ ర్యాలీ సాయంకాలం వరకు కొనసాగింది. మడకశిర, అమరాపురం, గుడిబండ, రొళ్ల, అగళి మండలాల్లో బైక్ ర్యాలీ సాగింది. మడకశిర నుంచి మెళవాయి క్రాస్, కదిరేపల్లి, ఉగ్రేపల్లి, కేకాతి, జంబులబండ, హిరేతుర్పి, నాగేపల్లి, హనుమంతనపల్లి, బసవనపల్లి, కనకనపల్లి, ఆలదపల్లి, చిట్నడుకు, హల్కూరు, అమరాపురం, కాచికుంట, కెంకర, హేమావతి, గుణేపల్లి,శివరం క్రాస్, బల్లేకట్ట, మోరుబాగల్, తిమ్మలాపురం, తాళికెర, గుడిబండ, ఫళారం, మందలపల్లి, స్వారగిరి, అగ్రహారం, రొళ్ల, ఆవినకుంట, తూబినకుంట, ఇనగలూరు, తొణసనపల్లి, మధూడి, నరసంబూది మీదుగా అగళి వరకు బైక్ ర్యాలీ కొనసాగింది. బైక్ ర్యాలీకి ఊరూరా ఘన స్వాగతం లభించింది. ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఆయా గ్రామాల్లో స్వాగతం పలికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మద్దతు పలికారు.

జోష్ పెంచిన బైక్ ర్యాలీ

నియోజకవర్గంలో నిర్వహించిన బైక్ ర్యాలీ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో జోష్ పెంచింది. ఎన్నికల్లో పార్టీ శ్రేణులు మరింత ఉత్సాహంగా పని చేయడానికి బైక్ ర్యాలీ దోహదం చేసింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప మాట్లాడుతూ బైక్ ర్యాలీని విజయవంతం చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. బైక్ ర్యాలీలో వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు ప్రసాద్‌రెడ్డి, మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, వాగేష్, వైఎస్ రవిశేఖర్‌రెడ్డి, రంగేగౌడ్, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంతరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్రప్ప, పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, జెడ్పీటీసీలు అనంతరాజు, భూతరాజు, సరోజమ్మ, రొళ్ల ఎంపీపీ కవిత, మడకశిర ఎంపీపీ కవిత, అగళి ఎంపీపీ రేణుక, అమరాపురం ఎంపీపీ ఈరన్న, వైస్ ఎంపీపీ లలితమ్మ, కృష్ణమూర్తి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు త్రిలోక్‌నాథ్, రామిరెడ్డి, డీఎల్ యంజారేగౌడ్, నరసింహారెడ్డి, స్టూడియో శ్రీనివాస్, రొళ్ల మాజీ కన్వీనర్ శివప్రసాద్, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం కార్యదర్శులు బేకరి నాగరాజు, శ్రీరాములు, సత్యనారాయణ, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు రామకృష్ణ, శాలిని, నేత్రావతి, జేసీఎస్ కన్వీనర్లు విక్రమ్, శివకుమార్, నాగేంద్రయాదవ్, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ హనుమంతరెడ్డి, అగళి ఎంపీపీ కామరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి

లేపాక్షి: మీ ఇంటి ఆడబిడ్డగా.. మీ చెల్లిగా.. మీ అక్కగా మీ ముందుకు వస్తున్నా. తనతో పాటు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్ దీపిక ప్రజలను అభ్యర్థించారు. ఆదివారం ఉదయం మండలంలోని కంచిసముద్రం, మద్దిపి, ఐదుకళ్ల సదాశివనగర్, బసవనపల్లి, బయన్నపల్లి, మామిడిమాకులపల్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి దీపిక ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మంచిని వివరించారు. మళ్లీ పథకాలన్నీ అందాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ప్రచారం నిర్వహించారు. అనంతరం దీపికా మాట్లాడుతూ హిందూపురంలో 40 ఏళ్లుగా టీడీపీ వారే ఎమ్మెల్యేలుగా ఉన్నప్పటికీ నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. రెండుసార్లు బాలకృష్ణను ఎమ్మెల్యేగా ఎన్నుకున్నా హైదరాబాద్‌లోనే మకాం వేసి షూటింగ్‌లు చేసుకుంటున్నారే తప్ప ప్రజల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు ఆదినారాయణ, అగ్రిబోర్డు చైర్మన్ ప్రభాకర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహేంద్రరెడ్డి, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, నాయకులు వెంకటేష్, శ్రీనివాసరెడ్డి, అడివప్ప, గోపాలప్ప, ఆనంద్, శ్రీరామిరెడ్డి, చంద్ర, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కంచిసముద్రంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక

హిందూపురం: మండల పరిధిలోని కగ్గల్లు గ్రామ పంచాయతీలో కగ్గల్లు, సుబ్బిరెడ్డిపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్.దీపిక వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డితో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమాభివృద్ధిని వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు.

పూలకుంటలో ఇఫ్తార్ విందు

హిందూపురం: అల్లా అందరి జీవితాల్లో సుఖ సంతోషాలు నింపాలని ప్రార్థిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్.దీపిక అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పూలకుంట గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, హనుమంతరాయప్ప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డితో కలసి ముస్లింలకు భోజనాలు వడ్డించారు.